

సర్పంచుల చలో అసెంబ్లీ రేపు

నెల్లిమర్ల, ఫిబ్రవరి 4: ఈ నెల 6న సర్పంచుల చలో అసెంబ్లీని తలపెడుతున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ కార్యదర్శి జి.రాజారావు, సర్పంచుల సంఘం విజయనగరం జిల్లా అధ్యక్షుడు స్వామినాయుడు తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. 16 డిమాండ్ల పరిష్కారం కోసం చలో అసెంబ్లీని చేపడుతున్నామని, పెద్దఎత్తున సర్పంచులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆర్థిక సంఘాల నిధులను సర్పంచుల ఖాతాల్లో జయ చేయాలని, సచివాలయాలు, వలంటీర్లను పంచాయతీల ఆధీనంలో పనిచేయించాలని, ఉపాధి నిధులు, ఉచిత విద్యుత్ ఇవ్వాలని, గౌరవ వేతనం పెంచాలని డిమాండ్ చేశారు.

కురుపాంలో గిరిజన ఇంజనీరింగ్ కళాశాల భవనాలు ఇలా..





ప్రచార ఆర్భాటమేనా?

- వైద్య, గిరిజన ఇంజనీరింగ్ కళాశాలలు మంజూరు చేసినట్లు సర్కారు గొప్పలు
- నిర్మాణాలపై మాత్రం దృష్టి సారించని వైనం
- ఎన్నికలకు సమీపిస్తున్న సమయం
- కోడ్ అమలులోకి వచ్చేలోగా పనులు పూర్తయ్యేనా?
- క్షేత్రస్థాయిలో భిన్న పరిస్థితులు
- నిరాశలో జిల్లావాసులు

(పార్వతీపురం- ఆంధ్రజ్యోతి)

హడావుడిగా కొత్త జిల్లాలను ఏర్పాటు చేసిన వైసీపీ సర్కారు.. వాటి ప్రగతిని మాత్రం పట్టించుకోవడం లేదు. అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తరచూ చెప్పుకుంటున్న ప్రభుత్వం ప్రకటనలకే పరిమితమవుతోంది. ఆ స్థాయిలో నిధులు కేటాయించడం లేదు. సకాలంలో బిల్లులు చెల్లించడం లేదు. దీంతో పనులు కదలడం లేదు. నాలుగున్నరేళ్లుగా నత్తనడకనే సాగుతున్నాయి. అవి ఎప్పటికి పూర్తవుతాయో.. ఇంకెప్పటికి అందుబాటులోకి వస్తాయో తెలియని పరిస్థితి. మన్యం జిల్లా విషయానికొస్తే.. వైద్య కళాశాల మంజూరు చేసినట్లు గొప్పగా ప్రకటించిన సర్కారు.. దాని నిర్మాణం విషయం మాత్రం మరిచింది. మరోవైపు గిరిజన ఇంజనీరింగ్ కళాశాల పనులు కూడా కొలిక్కి రావడం లేదు. కొద్ది నెలల్లో ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. ఆ లోగా వాటి పనులు పూర్తవుతాయా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఎలక్షన్ కోడ్ అమలులోకి వస్తే.. ఇక అంతే సంగతి. మొత్తంగా సర్కారు తీరుపై జిల్లావాసులు పెదవి విరుస్తున్నారు. మన్యానికి వైద్య, గిరిజన ఇంజనీరింగ్ కళాశాలలను మంజూరు చేసినట్లు ప్రకటించిన ప్రభుత్వం.. వాటి పనుల పూర్తికి చర్యలు తీసుకోకపోవడంపై గిరిజన, ప్రజా సంఘాల నేతలు సైతం మండిపడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాకు వైద్య కళాశాల మంజూరు చేశామంటూ సుమారు రెండేళ్ల కిందట సీఎం జగన్ ఎంతో ఆర్భాటంగా ప్రకటించారు. ఆ తర్వాత పార్వతీపురం మండలం అడ్డాపుశీలలో అధికారులు స్థల పరిశీలన చేశారు. దీంతో జిల్లావాసులు, గిరిశిఖర గ్రామస్థులు ఎంతో సంతోషించారు. మెరుగైన వైద్యం అందుతుందని, అత్యవసర వేళల్లో విజయనగరం, విశాఖకు పరుగుపెట్టాల్సిన అవసరం లేదని భావించారు. తమ కష్టాలు తీరుతాయని అనుకున్నారు. అయితే వారికి నిరాశే ఎదురైంది. ఇంతవరకు శంకుస్థాపన చేయలేదు. మొత్తంగా నేటికీ వాటి పనులు ప్రారంభించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గిరిజన ప్రాంతాల్లో వైద్య కళాశాల మంజూరు అంటే చిన్నమాట కాదని చెప్పుకుంటున్న ప్రభుత్వ పెద్దలు ఆ కళాశాల పనులు ఎప్పుడు ప్రారంభిస్తారో మాత్రం చెప్పడం లేదు.

● వాస్తవంగా జిల్లాలో ఏజెన్సీ వాసులు తరచూ మలేరియా, విష జ్వరాలు, సీజనల్ వ్యాధులతో బాధపడుతుంటారు. ఈ నేపథ్యంలో పీహెచ్‌సీ, సీహెచ్‌సీలకు క్యూ కడుతుంటారు. కొన్ని సందర్భాల్లో డోలీ కట్టుకుని మరీ జిల్లాకేంద్రాసుపత్రికి తరలివస్తుంటారు. ఇదే సమయంలో రోగుల తాకిడి ఎక్కువగా ఉంటే.. అక్కడ ఒకే బెడ్‌పై ఇద్దరు చొప్పున వైద్య సేవలు పొందాల్సిన దుస్థితి. మెరుగైన వైద్యసేవలకు మాత్రం విశాఖ, విజయనగరం తరలివెళ్లాల్సి వస్తోంది. అయితే ఆయా జిల్లాలకు చేరుకునే లోపే.. కొందరు రోగులు మార్గమధ్యంలోనే మృతిచెందుతున్నారు. ఈ పరిస్థితుల నుంచి బయటపడాలంటే జిల్లాకు వైద్య కళాశాల ఎంతో అవసరం. అయితే ఇంతవరకు దీని నిర్మాణంపై సర్కారు ఎటువంటి ప్రకటన చేయలేదు. కనీసం పునాది రాయి కూడా పడలేదు. కొద్ది నెలల్లో ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున.. వైద్య కళాశాల పనులు ప్రారంభమయ్యేలా కనిపించడం లేదు. మొత్తంగా జిల్లాకు వైద్య కళాశాల మంజూరు అనేది వైసీపీ సర్కారు కాగితాలకే పరిమితం చేయడంపై 'మన్యం' వాసులు మండిపడుతున్నారు.

మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల పనులు నత్తనడకనే...

పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల కేంద్రంగా ప్రారంభించిన మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల పనులు కూడా నత్తనడకన కొనసాగుతున్నాయి. వాటి ద్వారా ప్రజలకు ఇప్పట్లో వైద్యసేవలు అందే పరిస్థితి కనిపించడం లేదు. జిల్లా కేంద్రం పార్వతీపురంలో పనులు సుమారు 30 నుంచి 40 శాతంలోపే పూర్తయ్యాయి. సీతంపేటలో 70 శాతం మేర నిర్మాణం పూర్తయినా.. ఎన్నికల సమయంలోగా అందుబాటులోకి వచ్చే పరిస్థితి లేదు. వాటిపై ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు సైతం ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించకపోవడంతోనే ఈ దుస్థితి నెలకొందనే వాదనలు లేకపోలేదు.

గిరిజన ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణం ఇలా..

జిల్లాకు గిరిజన ఇంజనీరింగ్ కళాశాల మంజూరు చేసినప్పటికీ వాటి పనులు కూడా పూర్తి కాలేదు. కురుపాం మండలానికి రెండు కిలోమీటర్ల దూరంలోని టేకరిఖండిలో సుమారు రూ. 123 కోట్లతో నిర్మాణం చేపడుతుండగా.. నేటికీ తుది దశకు చేరుకోవడం లేదు. ఏపీడబ్ల్యూఈఐడీసీ ఆధ్వర్యంలో ఇప్పటివరకు సుమారు 60 శాతం పనులే పూర్తయినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. కాగా గిరిజన ఇంజనీరింగ్‌కళాశాల కూడా ఎన్నికల లోపు అందుబాటులోకి వచ్చేలా కనిపించడం లేదు. దీంతో గిరిజన విద్యార్థులు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా వైసీపీ ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి వైద్య, గిరిజన ఇంజనీరింగ్ కళాశాలల నిర్మాణంపై దృష్టి సారించాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

గడువులోగా పూర్తి చేస్తాం..

గిరిజన ఇంజనీరింగ్ కళాశాలకు సంబంధించి అక్టోబరు లోపు పనులు పూర్తి చేయాల్సి ఉంది. గడువులోగా కాకుండా ముందుగానే పనులు పూర్తి చేస్తాం. ఇప్పటివరకు సుమారు 60 శాతం పనులు పూర్తయ్యాయి.

-రామకృష్ణ, డీఈఈ, ఏపీడబ్ల్యూఈఐడీసీ..

సాగర సంగ్రామ దీక్షలో మనోళ్లు

- నిరసనలో జిల్లా ఉపాధ్యాయులు



సంగ్రామ దీక్ష శిబిరంలో జిల్లా ఉపాధ్యాయులు

సాలూరు రూరల్, ఫిబ్రవరి 4: పాత పెన్షన్ స్కీం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. ఏపీ సీపీఎస్ఈఏ ఉద్యోగులు ఆదివారం విశాఖలో సాగర సంగ్రామ దీక్ష చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమానికి జిల్లా నుంచి పెద్దఎత్తున ఉపాధ్యాయులు తరలివెళ్లారు. 15 మండలాలకు చెందిన వారు దీక్షలో కూర్చొని వైసీపీ సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేసి.. ఓపీఎస్ అమలు చేస్తామని హామీ ఇచ్చిన సీఎం జగన్ మాట తప్పారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని నినాదాలు చేశారు. దీక్ష శిబిరంలో ఏర్పాటు చేసిన సీపీఎస్ హామీ సమాధికి పాచిపెంట ఏపీటీఎఫ్ మాజీ అధ్యక్షుడు సింగారపు ఎల్లయ్య తదితరులు పూలమాల వేసి నివాళి అర్పించారు.



సీపీఎస్ రద్దు హామీ సమాధిపై పూలమాలలు వేస్తూ..



చదురుగుడి వద్ద అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తజనం

శంబరకు పోటెత్తిన భక్తులు

- పోలమాంబ దర్శనానికి బారులు

మక్కువ, ఫిబ్రవరి 4: శంబర గ్రామానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సుదూర, పరిసర ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన వారు పోలమాంబ దర్శనానికి బారులుదీరారు. తెల్లవారుజాము నుంచే భక్తజనం తాకిడి కనిపించింది. దీంతో చదురుగుడి వద్ద క్యూలైన్లు కిటకిటలాడాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని చీరలు, పసుపు, కుంకుమలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు ఆలయ సమీపంలో వంటలు చేసుకుని కుటుంబ సభ్యులతో కలిసి భోజనాలు చేశారు. అనంతరం వారు వనంగుడి వద్ద వేపచెట్టుకు పూజలు చేశారు. ఇదిలా ఉండగా మంగళవారం అమ్మవారి మూడోవారం జాతర జరగనున్న నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పెద్దఎత్తున భక్తులు తరలిరానున్న దృష్ట్యా ఎవరికీ ఎటువంటి ఇబ్బంది కలగకుండా, త్వరగా అమ్మవారి దర్శనం కలిగేలా చర్యలు చేపడుతున్నారు.



పూజలందుకున్న పోలమాంబ

రహదారిపై ఏనుగులు

- హడలిపోయిన వాహనదారులు, గ్రామస్థులు



తొడుము రహదారిపై సంచరిస్తున్న ఏనుగుల గుంపు

కొమరాడ, ఫిబ్రవరి 4: మండల వాసులను ఏనుగులు హడలెత్తిస్తున్నాయి. గ్రామీ సమీపంలో, రహదారులపై సంచరిస్తూ.. స్థానికులను బెంబేలెత్తిస్తున్నాయి. తాజాగా ఆదివారం సాయంత్రం సీమనాయుడువలస జంక్షన్- తొడుము గ్రామ రహదారిపై ఏడు ఏనుగులు హల్‌చల్ చేశాయి. సుమారు గంటకు పైగా అవి ఆ రోడ్డుపైనే సంచరించాయి. ఏనుగుల గుంపు ఒక్కసారిగా రహదారిపై రావడంతో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులకు గురయ్యారు. వాహన రాకపోకలు కూడా నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న అటవీశాఖ సిబ్బంది అక్కడకు చేరుకుని సమీప పంట పొలాల్లోకి ఏనుగులను తరలించారు. దీంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. అనంతరం యథావిధిగా ఆ మార్గంలో వాహన రాకపోకలు సాగాయి. ఇదిలా ఉండగా ఏనుగుల గుంపు కొద్దిరోజులుగా దళాయిపేట, మాదలంగి, తొడుము, వన్నాం, పాలెం గ్రామ పరిసరాల్లో తిష్ట వేయడంతో రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు భయపడుతున్నారు. తక్షణమే వాటిని ఈ ప్రాంతం నుంచి తరలించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

సందడిగా వ్యాకులమాత జాతర

లక్కవరపుకోట (కొత్తవలస), ఫిబ్రవరి 4: కొండడాబా వ్యాకులమాత జాతర ఆదివారం సందడిగా జరిగింది. కొండపైనున్న వ్యాకులమాత దర్శనానికి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి లక్షలాది మంది భక్తులు హాజరయ్యారు. ఏటా లాగే విశాఖపట్నంలోని జ్ఞానాపురం నుంచి జాతర ముందురోజు బాలయేసును ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆయన్ను వ్యాకులమాత చెంత చేర్చారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి కొండడాబా విచారణ కర్త గొంగాడ రాజు ఆధ్వర్యంలో పలువురు బిషప్‌లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి వ్యాకులమాతకు ప్రజల విన్నపాలను విన్నవించారు. సాయంత్రం దివ్యబలి పూజతో జాతరకు ముగింపు పలికారు. జాతరకు విశాఖపట్నం నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. భక్తుల తాకిడిని దృష్టిలో పెట్టుకొని పోలీసులు సుమారు 300 మందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. 120 అడుగుల ఏసు విగ్రహం అందరినీ ఆకట్టుకుంది.



కొండడాబా వ్యాకులమాత జాతరలో భక్తులు ఇలా..

ఎన్‌ఆర్‌సీ.. ఏంటీ పరిస్థితి!

- సీతంపేట ఏరియా ఆసుపత్రిలో వెలవెలబోతున్న పోషకాహార పునరావాస కేంద్రం
- బరువు తగ్గిన, అనారోగ్య చిన్నారులను చేర్చడంలో జాప్యం

సీతంపేట, ఫిబ్రవరి 4: సీతంపేట ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన పోషకాహార పునరావాస కేంద్రం (ఎన్‌ఆర్‌సీ) చిన్నారులు లేక వెలవెలబోతుంది. ఈ కేంద్రంలో బరువు తగ్గిన పిల్లలను చేర్చడంలో జాప్యం జరుగుతోంది. గత నెల రోజులుగా ఒక్క చిన్నారిని కూడా అంగన్‌వాడీ సిబ్బంది చేర్చలేదు. బరువు తగ్గిన, అనారోగ్యానికి గురైన పిల్లలను ఆరోగ్యవంతులుగా మార్చేందుకు టీడీపీ ప్రభుత్వ హయాంలో సీతంపేట ఆస్పత్రిలో పోషకాహార పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో చేరిన పిల్లలకు 14 రోజుల పాటు పౌష్టికాహారం, అవసరమైన మందుల అందిస్తారు. బరువు పెరిగేలా చూసి సంపూర్ణ ఆరోగ్యంతో వారిని ఇంటికి పంపిస్తారు. పిల్లల సంరక్షణ కోసం వచ్చిన తల్లులకు రోజుకు రూ.100 చొప్పున ప్రభుత్వమే సమకూర్చాలి. వాస్తవానికి అనారోగ్యానికి గురైన పిల్లలను ఎన్‌ఆర్‌సీలో చేర్పించే బాధ్యత అంగన్‌వాడీ సిబ్బందిపై ఉంది. కానీ, నెల రోజులకు పైగా వారు సమ్మె చేశారు. తరువాత సమ్మె విరమించినప్పటికీ పూర్తిస్థాయిలో బాధ్యతలు చేపట్టలేదు. దీంతో ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో బరువు తగ్గిన పిల్లలను గుర్తించలేని పరిస్థితి నెలకొంది. ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది కూడా పట్టించుకోకపోవడంతో పిల్లలు లేక ఎన్‌ఆర్‌సీ వెలవెలబోతుంది. ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్న వైద్యాధికారులు ఐసీడీఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం శూన్యం. ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు వివరణ కోరగా.. 'పోషకాహార పునరావాస కేంద్రాన్ని సక్రమంగా నిర్వహిస్తున్నాం. బరువు తగ్గిన, అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారులకు ఈ కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుంది. గత నెల రోజులుగా ఈ కేంద్రంలో పిల్లలు చేరని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే ఈ విషయాన్ని ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకెళ్లాను' అని తెలిపారు.



సీతంపేట ఏరియా ఆసుపత్రిలో ఎన్‌ఆర్‌సీ ఇలా..

సెలవు రోజుల్లోనూ సేవలు

- 'రూపాయికే స్థలం రిజిస్ట్రేషన్'కు స్పందన కరువు
- ముందుకురాని లబ్ధిదారులు
- ఒకవైపు సర్వర్ సమస్య.. - మరోవైపు అధికారులు ఆదేశాలు
- తలలు పట్టుకుంటున్న రెవెన్యూ, సచివాలయ సిబ్బంది
- ఆదివారం కూడా విధులు నిర్వహించాల్సిన పరిస్థితి..



(గరుగుబిల్లి)

రూపాయికే స్థలం రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు వైసీపీ సర్కారు ప్రకటించినా.. లబ్ధిదారులు మాత్రం ఆసక్తి చూపడం లేదు. గతంలో జగనన్న కాలనీల్లో స్థలం పొందిన వారిలో అత్యధికులు ముందుకు రావడం లేదు. జగనన్న లేఅవుట్లలో వసతులు లేకపోయినా, ఎన్నికల వేళ సర్కారు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే.. కాగా సంబంధిత రిజిస్ట్రేషన్ ప్రక్రియ బాధ్యతలను సచివాలయ కార్యదర్శులకు అప్పగించారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులు తమ స్థల పట్టాలు, ఆధార్‌ను అందిస్తే కార్యదర్శి రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంది. అయితే ప్రజల నుంచి అంతంత మాత్రంగానే స్పందన లభిస్తుంది. లబ్ధిదారులకు స్వయంగా సమాచారం అందించినా సచివాలయల వైపు కన్నెత్తి చూపడడం లేదు. రెవెన్యూ సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నా ఫలితం కనిపించడం లేదు. గత కొద్ది రోజులుగా సంబంధిత సచివాలయాల్లో నమోదు ప్రక్రియను రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. అయితే సర్వర్ సమస్య వేధించడంతో ముందుకు వెళ్లని పరిస్థితి ఏర్పడింది. ఆదివారం గొట్టివలస సచివాలయంలో ఉప తహసీల్దార్ సత్యలక్ష్మీకుమార్, కార్యదర్శులు టి.భాస్కరరావు, భార్గవ్‌తో పాటు వీఆర్‌వో ఆర్.రామానుజం తదితరులు ఉండి స్థలం రిజిస్ట్రేషన్లకు కుస్తీ పట్టారు. మరోవైపు ఈ విషయంలో సంబంధిత ఉన్నతాధికారులు తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తుండగా.. సర్వర్ సమస్య నేపథ్యంలో సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. స్థల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వీరికి తలనొప్పిగా మారింది.



గొట్టివలస సచివాలయంలో స్థల రిజిస్ట్రేషన్లకు నిరీక్షిస్తున్న అధికారులు

సెలవు దినాల్లో..

ప్రస్తుతం జిల్లా పరిధిలోని సచివాలయాల్లో రెవెన్యూ, సచివాలయ సిబ్బంది సెలవు దినాల్లోనూ విధులు నిర్వహించాల్సిందేనని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర రిజిస్ట్రేషన్, స్టాంప్స్ కమిషనర్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఈ నెల 3న ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ఫిబ్రవరికి సంబంధించి 4, 10, 11, 18 తేదీలు సెలవు దినాలు అయినప్పటికీ యథావిధిగా సేవలు అందించాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. పేదలందరికీ ఇళ్ల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలని సూచించారు. ఒకవైపు రిజిస్ట్రేషన్, మరోవైపు కుల గణన, ఆరోగ్యశ్రీ కార్డులతో పాటు పలు కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు.

ముందుకు కదలని ప్రక్రియ..

జిల్లాలోని 15 మండలాల్లోని 307 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముందుకు కదలడం లేదు. జిల్లాకు సంబంధించి 9,427 మందికి గాను 1,633 మందే రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మరో 7,794 మంది రిజిస్ట్రేషన్ ప్రక్రియకు దూరంగానే ఉన్నారు. కొన్ని సచివాలయాల్లో ఒకటి కూడా నమోదు కాని పరిస్థితి. ఎన్నికలకు ముందు ఈ ప్రక్రియ ప్రారంభం కావడంతో రెవెన్యూ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు ఎన్నికల నిర్వహణ, మరోవైపు రిజిస్ట్రేషన్ల నమోదుతో తీవ్రస్థాయిలో ఒత్తిడికి గురవుతున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారు పరుగులు తీస్తున్నా సర్వర్ సమస్య ఆటంకంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది.

వేగవంతానికి చర్యలు..

సచివాలయాల పరిధిలో స్థలం రిజిస్ట్రేషన్ల వేగవంతానికి చర్యలు తీసుకుంటున్నాం. లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నాం. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు సచివాలయాల కార్యదర్శులు, వీఆర్‌వోలకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశాం. నిర్దేశించిన లక్ష్యాలను చేరుకొనేలా సచివాలయాలకు సిబ్బందిని నియమించాం. ప్రస్తుతం సర్వర్ సమస్య వేధించడంతో ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది. గరుగుబిల్లికి సంబంధించి 13 సచివాలయాల్లో 433కు గాను 102 నమోదయ్యాయి.

-పి.సత్యలక్ష్మికుమార్, ఉప తహసీల్దార్, గరుగుబిల్లి

నేడు ఉపాధి హామీ ప్రజావేదిక

లక్కవరపుకోట: మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధి పథకం పనులకు సంబంధించిన సామాజిక తనిఖీ ప్రజా వేదికను సోమవారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కే.రూపేష్ తెలిపారు. 31 పంచాయతీల నుంచి ఆయా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు. జనవరి 18 నుంచి ఫిబ్రవరి 3 వరకు 31 పంచాయతీల్లో సోషల్ ఆడిట్ జరిగిందని తెలి పారు. సుమారు రూ.19 కోట్లకు సంబంధించిన పను లపై సమగ్ర విచారణ సోమవారం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

తెల్లదోమ నివారణకు చర్యలు

రాజాం: తెల్లదోమ నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని సెంచూరియాన్ కళాశాల విద్యార్థులు రైతులకు అవగాహన కల్పించారు. ఆదివారం పొగిరి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో పంటల తెగుళ్ల, వ్యాధుల దాడిపై ప్రదర్శన ఇచ్చారు. ఈ పురుగు తెలియకుండానే పంటలపై చాలా ప్రభావవ చూపుతుందన్నారు. వీటినుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు.

కార్యాలయానికి స్థలం సమకూరుస్తా

బొబ్బిలి: వీరబొబ్బిలి మాజీ సైనికోద్యోగుల సంఘం సభ్యుల అవసరాల కోసం బొబ్బిలి పట్టణంలో తాత్కాలికంగా కార్యాలయం ఏర్పాటు చేసుకునేందుకు స్థలాన్ని సమకూరుస్తానని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బేబీనాయన హామీ ఇచ్చారు. పార్లమెంట్ నియోజకవర్గ బీసీ సాధికార కమిటీ అధ్యక్షుడు కొల్లి అప్పలనాయుడు చొరవతో వీరబొబ్బిలి మాజీసైనికోద్యోగుల సంఘం సభ్యులంతా ఆదివారం సాయంత్రం స్థానిక దర్బారు మహల్‌లో బేబీనాయనతో సమావేశమయ్యారు. 20 ఇరవయ్యేళ్ల నుంచి తమకు సంఘ భవనాన్ని, స్థలాన్ని ఏర్పాటు చేయాలని అభ్యర్థిస్తున్నామని సంఘం గౌరవాధ్యక్షుడు మరడ అప్పారావు కోరారు. దీనిపై స్పందించిన బేబీనాయన ఎన్నికలయ్యేంత వరకు తాత్కాలిక భవనాన్ని ఏర్పాటు చేసుకునేందుకు సోమవారం పట్టణంలో స్థలాన్ని కేటాయిస్తామని ప్రకటించారు. ఎన్నికల తరువాత వ్యక్తిగతంగా గాని, ప్రభుత్వ పరంగా గాని శాశ్వత స్థలాన్ని, భవనాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

వైద్య విజ్ఞానంపై అవగాహన సదస్సు

రింగురోడ్డు: ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పూల్‌బాగ్‌లో ఓ ప్రైవేట్ హోటల్లో వైద్యవిజ్ఞానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ మాటూరి సుస్మా మాట్లాడుతూ కాలిన గాయాలను వెంటనే చల్లటి నీటితో శుభ్రం చెయ్యాలని, ఆ గాయాలకు డ్రెస్సింగ్ అవసరమన్నారు. డాక్టర్ దినేష్‌కుమార్, ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్య సంఘం ప్రతినిధులు మమ్ముల తిరుపతిరావు, గుప్తా, గిడిజాల వెంటరమణ, గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రింగురోడ్డు: నగరంలోని అంబటి సత్రం నుంచి, కొత్తపేట నీళ్లట్యాంక్ కూడలి వరకు ప్రధాన రహదారికి ఆదివారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శంకుస్థాపన చేశారు. ఈ రహదారి కోసం ఆర్‌అండ్‌బీ నుంచి రూ 3.5 కోట్లు, కార్పొరేషన్ నుంచి రూ.93.50 లక్షల నిధులను వెచ్చిస్తున్నారు. సందర్భంగా వీరభద్రస్వామీ మాట్లాడుతూ నగరాభివృద్ధే ధ్యేయంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. త్వరలోనే కంటోన్మెంట్ అయ్యన్నపేట రహదారిని కూడా ప్రారంభించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయా, ఫ్లోర్‌లీడర్ రాజేష్, డివిజన్ కార్పొరేటర్లు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన ర్యాలీ

రాజాం: ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా సెంటెన్స్ హాస్పటల్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాగోలు జెమ్స్ హాస్పటల్ వారిచే ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రాజాం పరిసర ప్రాంతాల నుంచి రోగులు పెద్ద సంఖ్యలో హాజరై తనిఖీలు చేయించుకున్నారు. ఉచితంగా మందులు అందజేశారు. క్యాన్సర్ నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేశారు.

కేంద్ర పథకాలను ప్రచారం చేయాలి

లక్కవరపుకోట (కొత్తవలస): బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా ఎస్.కోట నియోజకవర్గ కన్వీనర్ యలమంచిలి ప్రసాద్ ఆధ్వర్యంలో కొత్తవలస, ఎల్.కోట మండలాల్లో సమావేశాలు ఏర్పాటు చేశారు. కొత్తవలస బీవీకే పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో విశాఖ జిల్లా జనరల్ సెక్రటరీ దానేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పల్లెలోనూ బీజేపీ జెండా ఎగరాలని కోరారు. గంగుబూడి గ్రామంలో ఎల్.కోట మండల బీజేపీ అధ్యక్షుడు బొడ్డు సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రజలకు వర్కుషాప్ నిర్వహించారు.

మద్యం సీసాలు స్వాధనం

రేగిడి: మండలంలో జాడపేట గ్రామంలో ఆది వారం ఎన్నికల విధుల్లో నిర్వహించిన సోదాల్లో ఒక బెల్ట్ షాపు నిర్వహకుడి వద్ద 25 మద్యం సీసాలను పట్టుకున్నట్టు ఎస్ఐ శ్రీనివాస్ స్థానిక విలేఖర్లకు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదుచేసి అరెస్టుచేశామన్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో పేకాట శిబిరాలు, మద్యంబెల్ట్‌షాపులపై పూర్తి నిషేదం విధించి, చట్టపరమైన చర్యలు తీసుకొంటున్నామని ఆయన అన్నారు.

శ్రీకాకుళం జిల్లా అధ్యక్షునిగా మజ్జి

రాజాం: ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా రాజాంకు చెందిన మజ్జి మదన్‌మోహన్ మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఫ్యాప్టో చైర్మన్‌గా కూడా కొనసాగుతున్నారు. ఉపాధ్యాయల సమస్యల పరిష్కారమే ధ్యే యంగా గత నాలుగు సంవత్సరాలుగా శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఈయన నియామకం పట్ల రాజాంలో పలువురు ఉపాధ్యాయలు, సంఘాల నాయకులు అభినందించారు.

ఆర్యవైశ్యులకు వాసవీమాత వెండి ప్రతిమలు

శృంగవరపుకోట రూరల్: మండలంలోని సంతగైరమ్మపేట ధరణేశ్వరీస్వామి ఆలయంలో నిర్వహించిన సీతంపేట వాసవీక్లబ్ సమావేశంలో 41మందికి వారి కులదైవం వాసవీమాత వెండి ప్రతిమలను ఆదివారం సంఘ అధ్యక్షుడు కుసుమంచి నానాజీ, జిల్లా గవర్నర్ ఆత్మకూరి సాంబమూర్తి, ఆధ్వర్యంలో అందించారు. సంఘ ప్రతినిధులు పి రాజు, పి శ్రీను, హరి, సర్వదేముళ్లు తదితరులున్నారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

విజయనగరం దాసన్నపేట/రేగిడి: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఎపీటీఎఫ్- 257)నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్ బుకారిబాబు, ఉపాధ్యక్షుడిగా ఎం వెంకటరమణ, ఎల్ రామకృష్ణ, జీవీవీ ప్రసాద్, బి రాజేశ్వరీ, ప్రధాన కార్యదర్శిగా పాలతేరు శ్రీనివాస్, కార్యదర్శులుగా ఎలగల భాస్కరరావు, ఎన్ రవికుమార్, వై సీతంనాయుడు, పీవీ ప్రసాద్, కె సింహాచలం, రాష్ట్ర కౌన్సిలర్సుగా కె రవి, ఎం సత్యంనాయుడు, పి శ్రీరాముల నాయుడు, బొత్స పద్మావతి, గౌరవ అధ్యక్షులు బంకురు జోగినాయుడు, ఆడిట్ కమిటీ సభ్యులుగా డివి అచ్యుత్‌కుమార్, ఎలకల ఆదినారాయణ, బి సత్యనారాయణ, ఆర్ గోవిందనాయుడు, వై విజయ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు.

వైసీపీ పాలనలో అన్ని వర్గాలకూ అన్యాయమే

● 'బాబు ష్యూరిటీ'లో అదితి గజపతిరాజు


మలిచర్లలో అదితి గజపతిరాజుకు నుదుట తిలకం దిద్ది హారతి ఇస్తున్న ప్రజలు

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 4: వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయమే జరిగిందని విజయనగరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు అన్నారు. ఆదివారం రాత్రి బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకి గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించి మలిచర్ల గ్రామ ప్రజలను కలిశారు. మండల, ఆ గ్రామ టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లారు. ఈ క్రమంలో అదితి గజపతిరాజుకు హారతి ఇచ్చి, నుదుట కుంకుమను తీర్చిదిద్దారు. అనంతరం చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నాలుగేళ్ల తొమ్మిది నెలల కాలంలో ఈ రాష్ట్ర ప్రజలకు కష్టాలే మిగిలాయన్నారు. నిరుపేద, పేద, మధ్యతరగతితో పాటు అన్ని వర్గాల ప్రజలకు ఈ ప్రభుత్వం అన్యాయమే చేసిందన్నారు. అన్ని వ్యవస్థలను సర్వనాశనం చేసిందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేవన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, రాజేష్‌వర్మ, తుమ్మగంటి రామారావు, శివ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనకు చరమగీతం పాడండి


మాట్లాడుతున్న లలితకుమారి

లక్కవరపుకోట, ఫిబ్రవరి 4: రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న రాజారెడ్డి రాజ్యాంగం, పులివెందుల పంచాంగానికి ప్రజలు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని ఎస్.కోట నియోజకవర్గ ఇన్‌చార్జి కోళ్లలలితకుమారి పిలుపునిచ్చారు. ఆదివారం ఎల్.కోటలోని తమ స్వగ్రామంలో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో ప్రభుత్వంపై ఆమె పలు విమర్శలు చేశారు. జగన్మోహన్‌రెడ్డికి తమ ఆర్థిక భద్రతపైఉన్న శ్రద్ధ రాష్ట్ర శాంతిభద్రతలపై లేదని విమర్శించారు. తహసీల్దార్ హత్య, గంజాయి ఎగుమతులు వంటి తీవ్ర పరిణామాలను ఆమె ఈ సందర్భంగా ప్రస్తావించారు. రాష్ట్రంలో మరో పది రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ రానుందని, జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి చరమగీతం పాడడానికి రాష్ట్ర ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని ఆమె తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబీఏ.రాంప్రసాద్, జిఎస్.నాయుడు, మల్లా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలి


దీక్ష చేస్తున్న బాబ్జీ

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 4: రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు కేంద్రాసుపత్రిని వెంటనే మంజూరు చేయాలని జిల్లా ప్రభుత్వ క్యాన్సర్ ఆసుపత్రి సాధన సమితి అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. తక్షణమే క్యాన్సర్ ఆసుపత్రిని మంజూరు చేయాలని కోరుతూ మయూరి కూడలిలో నిరహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ప్రతి ఏభై ఇళ్లల్లో ఒకరికి క్యాన్సర్ వ్యాధి ఉన్నట్టు సర్వేలు చెబుతున్నాయని, శ్రీకాకుళం, పార్వతీపురం, విజయనగరం జిల్లాల్లో ఉన్నవారు విశాఖపట్టణం వెళ్లాల్సి ఉందని, సమయానికి వైద్యం అందక చనిపోతున్నారన్నారు. జిల్లాలో అత్యవసరంగా కీమోథెరపీ, రేడియోథెరపీ, క్యాన్సర్ స్క్రీనింగ్ కేంద్రం కావాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షకు సంఘీభావంగా జనసేన నాయకులు గురాన అయ్యలు, మర్రాపు సురేష్, మిడతాన రవితో పాటు వివిధ సంఘాల ప్రతినిధులు సంఘీభావం ప్రకటించారు.

వందేళ్ల వృద్ధురాలికి సత్కారం


నారాయణమ్మను సత్కరిస్తున్న దృశ్యం

శృంగవరపుకోట రూరల్: మండలంలోని కృష్ణాపురం గ్రామంలో బొచ్చ నారాయణమ్మ అనే శతాధిక వృద్ధురాలికి ఆమె కోడళ్లు, కుమారులు, కుమార్తెలు, మనమలు సత్కారం చేశారు. ఆదివారం ఆవిడకు వంద సంవత్సరాలు పూర్తవడంతో ఆమె కుటుంబ సభ్యులంతా ఒకచోట చేరి పండగలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యామిని దేవి, పెద్దలు ఈశ్వరరావు, నారాయణ, కుటుంబ సభ్యులు ఉన్నారు.

రోడ్డును పరిశీలించిన జనసేన నాయకులు


రోడ్డును పరిశీలిస్తున్న జనసేన నాయకులు

బాడంగి, ఫిబ్రవరి 4: మండలంలోని పింద్రంగివలస రోడ్డు సమస్య మీద గ్రామస్థుల అర్జీ మేరకు జనసేన పార్టీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి బాబు పాలూరు ఆ గ్రామం వెళ్లి పూర్తిగా పాడైపోయిన రోడ్డును పరిశీలించారు. అనంతరం సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడారు. తక్షణమే రోడ్డు పనులు మొదలుపెట్టాలని అధికారులను కోరారు. 10 రోజుల్లో మొదలుపెడతామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాడంగి మండల నాయకులు కొల్లి చైతన్య, రౌతు సురేష్, బొబ్బిలి మండల అధ్యక్షుడు సంచాన గంగాధర్, ఎందవ సత్యనారాయణ, బొన్నాడ గణేష్, కనకల శ్యామ్, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పక ధరించాలి


బైపాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న దృశ్యం

రామభద్రపురం, ఫిబ్రవరి 4: ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ తప్పక ధరించాలని ఎస్ఐ జ్ఞానప్రసాద్ కోరారు. మండలంలోని బైపాస్ రోడ్డు వద్ద ఆదివారం సాయంత్రం వాహనాల తనిఖీ నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ తగు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా మద్యం తాగి వాహనాలు నపడపడం వల్ల ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తాయని తెలిపారు. రోడ్డు నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నిరోధించవచ్చని తెలిపారు. వాహనాల తనిఖీల్లో హెచ్‌సీ రమణ, పోలీసులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నాయకుల ముందస్తు అరెస్టు


విజయగౌరిని అదుపులో తీసుకున్న పోలీసులు

బొబ్బిలి, ఫిబ్రవరి 4: సీపీఎస్ రద్దు కోసం విశాఖలో ఆదివారం జరగనున్న సాగర సంగ్రామ ర్యాలీకి వెళ్లకుండా నిరోధిస్తూ యూటీఎఫ్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. యూటీఎఫ్ మహిళా నేత కె.విజయగౌరితో పాటు మరో ముగ్గురు నాయకులను పోలీసులు ఆదివారం వేకువ జామున వారి ఇళ్ల వద్ద అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడిచిపెట్టారు.

శ్రమదానంతో గుంతల పూడ్చివేత


రోడ్డుపై గుంతలను పూడ్చుతున్న దృశ్యం

బొబ్బిలి, ఫిబ్రవరి 4: బొబ్బిలిలోని గాంధీ స్మారక నిధి సభ్యులు శ్రమదానంతో రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చుకున్నారు. బొబ్బిలి-పార్వతీపురం స్టేట్ హైవేలో స్థానిక జూట్‌మిల్లు నుంచి పాత బొబ్బిలి వరకూ రహదారిలో ఉన్న గుంతలు అత్యంత ప్రమాదకరంగా తయారయ్యాయి. సాయిశార్వాణి జంక్షన్, పెట్రోల్ బంకు ముందు రోడ్డుపై పెద్దగుంతలు ఏర్పడడంతో వాహనచోదకులు తీవ్ర అసౌకర్యానికి, అవస్థలకు గురవుతున్నారు. గాంధీ స్మారకనిధి అధ్యక్షుడు మింది విజయమోహనరావు ఆధ్వర్యంలో పలువురు యువకులు శ్రమదానం చేసి ఆదివారం రోడ్డుపై గుంతలను పూడ్చారు. ఇసరాపు బాబూరావు, వెలగాడ రాంబాబు, సైలాడ జాషువా, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో భయం పోగొట్టడమే లక్ష్యం

బాడంగి: విద్యార్థుల్లో భయం పోగొట్టడమే ప్రజ్ఞా వికాస పరీక్ష లక్ష్యమని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హరికృష్ణ, జిల్లా నాయకులు కృష్ణ అన్నారు. పదోతరగతి విద్యార్థుల్లో పరీక్షలపై భయాందోళన తొలగించేందుకు ఆదివారం మండలంలోని బాడంగి, కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ప్రజ్ఞా వికాశ పరీక్షను ఏర్పాటు చేశామన్నారు. ● **బొబ్బిలి:** ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శ్రీసాయి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ప్రజ్ఞా పరీక్షలు నిర్వహించారు. రాష్ట్ర యూటీఎఫ్ నేత కె.విజయగౌరి ప్రశ్నా ప త్రాలను విడుదల చేసి ఈ కార్య క్రమాన్ని ప్రారంభించారు. ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కె.మణి, యూటీఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్, ఎస్ఎఫ్ఐ నాయకులు దావీదు, కిరణ్, లోకేశ్వరి, వసంత తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట/జామి: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పది విద్యార్థులకు ఆదివారం టాలెంట్ టెస్ట్ ఆదివారం నిర్వహించారు. శృంగవరపుకోట చైతన్య కళాశాలలో, జామి ప్రభుత్వ పాఠశాలలో ఈపరీక్షలను నిర్వహించారు. పది విద్యార్థులకు పరీక్షలంటే భయం పోగొట్టేందుకు, వారిలో ఉత్సాహం నింపేందుకు పరీక్షలు నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు.

తాళాం తీసే వరకు ఉండాల్సిందే

●ఆసరా సభనుంచి బయటకు వెళ్లనీయకుండా అధికారుల కాపలా


గేటుకు తాళాలు వేస్తున్న సిబ్బంది

వంగర, ఫిబ్రవరి 4: మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఆసరా సమావేశంలో మహిళలు అనేక ఇబ్బందులుపడ్డారు. సమావేశానికి ముందుగా వచ్చిన మహిళలు కటిక నేలపై కుర్చోని అనేక ఇబ్బందులు పడ్డారు. సమావేశానికి రాకపోతే సంక్షేమపథకాలు కట్ చేస్తామని చెప్పి అధికసంఖ్యలో మహిళలను తెచ్చి తక్కువ కూర్చీలు వేసి ఇబ్బందులు పెట్టారు. అదేవిధంగా నాయకులు కూడా ఒక్కొక్కరిగా వచ్చారు. ఆసరా సమావేశంలో 775 ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు రూ 572 కోట్లు చెక్కులు పంపిణి చేశారు. కార్యక్రమములో వైసీపీ నాయకులు మజ్జిశ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, పాలవలస విక్రాంత్, తలేరాజేష్, ఎంపిపి సురేస్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఆర్‌బీబీఎల్‌తో 'సెంచూరియన్' ఒప్పందం

పర్లాకిమిడి: సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఆర్‌బీబీఎల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు డాక్టర్ డీఎన్ రావు తెలిపారు. ఆదివారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంపొందించటానికి సెంచూరియన్ విశ్వవిద్యాలయం రాష్ట్రీయ వాణిజ్య బ్యాంక్ లిమిటడ్ నేపాల్‌లో కలిసి పనిచేస్తుందని తెలిపారు. ఈమేరకు ఆర్‌బీబీఎల్ ఉద్యోగులతో ఇటీవలే ఎంవోయూ కుదుర్చుకున్నట్లు తెలిపారు. సెంచూరియన్ విశ్వవిద్యాలయం విద్య నైపుణ్యాభివృద్ధిలో ప్రసిద్ధి చెందిందన్నారు. నేపాల్‌లోని ప్రముఖ ఆర్థిక సంస్థలతో ఒకటైన ఈ రాష్ట్రీయ వాణిజ్య బ్యాంక్ లిమిటెడ్ దేశ ఆర్థిక రంగంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఆ సంస్థ డిప్యూటీ కార్యనిర్వాహణ అధికారి దేబాష్ ప్రసాద్, దుర్గాకుమారి, వినోద్‌మాసాని, పద్మలక్ష్మి, వినోద్‌ఆత్రేయ, సెంచూరియన్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సిలర్ డాక్టర్ పీకే మహంతి, డాక్టర్ అనితా పాత్రో, సుప్రియా పట్నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టళ్ల విద్యార్థులకు అవగాహన సదస్సు


విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న డీబీసీడబ్ల్యూవో సందీప్‌కుమార్

బొబ్బిలి, ఫిబ్రవరి 4: స్థానిక బీసీ వసతి గృహంలో ఆదివారం పది బీసీ వసతి గృహాలకు చెందిన పదోతరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. 160 మంది విద్యార్థులకు నిపుణులైన సబ్జెక్టు ఉపాధ్యాయులతో పలు అంశాలపై అవగాహన కల్పించారు. వచ్చే నెల 18 నుంచి ప్రారంభం కానున్న పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు అనుసరించాల్సిన విజ్ఞానదాయకమైన అంశాలపై వారికి వివరించారు. పరీక్షల్లో భయాన్ని కోల్పోయి ఆత్మస్థైర్యంతో ఉత్తమ ఫలితాలను సాధించడం ఎలా అనే అంశాలపై విద్యార్థులకు బోధించారు. ఈ సందర్భంగా జిల్లా బీసీ సంక్షేమాధికారి కె. సందీప్‌కుమార్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో బీసీహాస్టళ్ల విద్యార్థులంతా తమ సత్తా చాటుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఏబీసీడబ్ల్యూవో శ్యామలాకుమారి, హెచ్‌డబ్ల్యూవోలు శ్రీనివాస రెడ్డి, దాసు, సరస్వతి తదితరులు పాల్గొన్నారు. బొబ్బిలి, కలవరాయి, పిరిడి, తెర్లాం, బాడంగి, ఏపీ పురం, ఎంఎస్ పురం , సంతకవిటి, సిరిపురం హాస్టళ్లకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

● బొబ్బిలి బీసీ వసతి గృహాల సముదాయానికి గ్రోత్‌సెంటరులో హీ రీ కంపెనీ ఆరేసిచొప్పున బాత్రూంలు, మరుగుదొడ్లు నిర్మిస్తున్నారని, బోరు వెల్ ఏర్పాటు చేశారని డీబీసీడబ్ల్యూవో సందీప్‌కుమార్ తెలిపారు.

మెయిన్‌రోడ్డా.. ఆటో స్టాండా?

● ట్రాఫిక్ చిక్కుల్లో వాహనచోదకులు


మెయిన్‌రోడ్‌లో బారులు తీరిన ఆటోలు

రాజాం రూరల్, ఫిబ్రవరి 4: ఈ చిత్రాలు చూస్తే ఇదేదో ఆటోస్టాండ్ అనుకుంటే తప్పులో కాలేసినట్లే.. ఈ చిత్రాలు రాజాం మెయిన్‌రోడ్ లోనివి. బస్టాండ్ అవుట్ గేట్ నుంచి మాధవబజార్, సంపత్‌భవన్ వరకూ పదుల సంఖ్యలో ఆటోలు నిలుపుదల చేస్తున్నా పోలీసులు కనీసం పట్టించుకోవడం లేదన్న విమర్శలు ప్రజలు, వాహనచోదకుల నుంచి నిత్యం వినిపిస్తున్నాయి. రోజంతా ఇదే పరిస్థితి ఉన్నా ప్రధానంగా ఉదయం పదిగంటల నుంచి రెండు గంటల వరకూ తిరిగి సాయంత్రం అయిదు గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకూ ఆటోలు నిలిపివేస్తున్నారు. దీంతో నడకా నరకంగానే ఉంటోంది. రాజాం కేంద్రంగా చీపురుపల్లి, గరివిడి, విజయనగరం, తెర్లాం, రామభద్రపురం, బొబ్బిలి, సాలూరు, విశాఖ పట్టణాలకు నిత్యం 150 నుంచి రెండు వందల వరకూ ఆటోలు ప్రయాణికుల్ని వారి వారి గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. ఇంతవరకూ సజావుగానే ఉన్నా ప్రయాణికుల కోసం మెయిన్‌రోడ్‌పై నిలపుదల చేయడమే సమస్యలకు దారితీస్తోంది. ఆటోలు క్రమపద్ధతిలో రాకపోకలు సాగించే దిశగా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదు. మాధవబజార్, బస్టాండ్ ప్రాంతంలో ఒక్కో హోంగార్డులను నియమించి చేతులు దులుపుకుంటున్నారు. వాళ్ల ఆటో డ్రైవర్లను నియంత్రించలేని పరిస్థితి కనిపిస్తోంది. ఫలితంగా ట్రాఫిక్ సమస్యలు, ప్రజల ఇక్కట్లు ఎక్కువవుతున్నాయి.

సంక్షేమానికి మారు పేరు చంద్రబాబే


దబ్బిరాజుపేట గ్రామ సభలో మాట్లాడుతున్నగొంప

వేపాడ: సంక్షేమానికి మారు పేరు చంద్రబాబునాయుడేనని నియోజకవర్గ యువనేత, రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ అన్నారు. మండలంలోని వేపాడ, వల్లంపూడి, దబ్బిరాజుపేట, గుడివాడ, కరకవలస, జాకేరు, సోంపురం, అరిగిపాలెం, జగ్గయ్యపేట, ఆకులసీతంపేట, ఆతవ, సింగరాయి తదితర గ్రామాల్లో ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన గ్రామసభల్లో గొంప మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధిలోనూ, సంక్షేమంలో ముందంజలో నిలవాలంటే తెలుగు దేశం పార్టీ జాతీయ నాయకుడు నారా చంద్రబాబునాయుడుతోనే సాధ్యమవుతుందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో మహిళాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. అలాగే నిరుపేదల అభివృద్ధి, సంక్షేమానికి, రైతు, బడుగు బలహీనవర్గాల వారి అభివృద్ధికి పెద్ద పీటవేశారన్నారు. రానున్న శాసనసభ ఎన్నికల్లో చంద్రన్న సారద్యంలో నడుస్తున్న తెలుగొశం పార్టీకి ఓట్లు వేసి అత్యధిక ఓట్లతో గెలిపించాలని పిలుపునిచ్చారు. మండల పార్టీ అధ్యక్షుడు గొంప వెంకటరావు, నియోజకవర్గ మహిళా నాయకురాలు గుమ్మిడి భారతి, బల్లంకి, బొద్దాం గ్రామాల మాజీ సర్పంచ్‌లు గొర్లె నాగరాజు, జనపరెడ్డి ఈశ్వరరావు, ఆయా గ్రామాల పార్టీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జమ్ము పాఠశాలను సందర్శించిన విద్యాశాఖ కమిషనర్


ఉపాధ్యాయులతో చర్చిస్తున్న కమిషనర్ సురేష్‌కుమార్

విజయనగరం (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి స్వచ్ఛ్‌విద్యాలయ పురస్కారానికి ఎంపికైన జమ్ము పాఠశాలను ఆదివారం రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఎస్ సురేష్‌కుమార్ సందర్శించారు. విద్యార్థులు అభివృద్ధి మౌళిక వసతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అవార్డులు రావడానికి కారకులైన పూర్వ పాఠశాల హెచ్‌ఎం రామ్మోహనరావును సన్మానించారు. మంచినీటి వసతి, మరుగుదొడ్లు, కరోనా-19 అంశాలను ప్రామాణికంగా తీసుకుని పాఠశాలను జాతీయ స్థాయి ఉత్తమ పాఠశాలగా ఎంపిక చేశారన్నారు. కార్యక్రమంలో డీఈవో లింగేశ్వరరెడ్డి, ఎంఈవో రాజు, ఎంఈవో సత్యవతి, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భౌతిక, రసాయనశాస్త్రాలపై పట్టు సాధించాలి


ఎంపికైన విద్యార్థులతో నిర్వాహకులు

రాజాం రూరల్: భౌతిక, రసాయనశాస్త్రాలపై విద్యార్థులు పట్టు సాధించాలని ఏపీ ఫిజికల్, సైన్స్ ఫోరం నిర్వాహకులు పండూరు వేణుగోపాల్ తదితరులు సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మేధోత్సవం పేరిట పదోతరగతి విద్యార్థులకు భౌతిక, రసాయన శాస్త్రాలపై ఆదివారం పోటీపరీక్షలు నిర్వహించారు. ఇంగ్లీష్, తెలుగు మీడి యంలో జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రకటించారు. ఇంగ్లీష్ మీడియంలో జె.సురేష్(పొగిరి), ఏ.సుబ్రహ్మణ్యం ఆచారి (కంచరాం), జె.సాయి వర్ధన్ (కంచరాం) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలను కైవసం చేసు కున్నారు. తెలుగు మీడియంలో వై.లావణ్య(రాజాం బాలికలు), వి.అంజుశ్రీ (దోసరి), టి.దాక్షాయణి (బొద్దాం) మొదటి మూడు స్థానాలు సాధించారు. విద్యార్థులను నిర్వాహకులు అభినందించారు.

వసతిగృహ విద్యార్థులకు 'ప్రేరణ'


మాట్లాడుతున్న దృశ్యం

శృంగవరపుకోట రూరల్: మండలంలోని ధర్మవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వసతి గృహ విద్యార్థులకు ఆదివారం ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. విజయనగరం రూరల్ పరిధిలో ఉన్న వసతిగృహ విద్యార్థినీ, విద్యార్థులకు పదోతరగతి పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో శిక్షణ ఇచ్చారు. ఈశాఖ జిల్లా అధికారి ఎం.యశోధనరావు మాట్లాడుతూ ప్రభుత్వ కల్పిస్తున్న సౌకర్యాలను ఉపయోగించుకోవాలన్నారు. జిల్లాలోని వసతి గృహ సంక్షేమ శాఖాధికారులు ఆర్ సత్యనారాయణ, చంద్రమౌళి, నీరజకుమారి, టీఎస్ఆర్ శర్మ, శ్రీధర్, చంద్రినాయుడు, పద్మినీ, గౌతమీ, కన్నంనాయుడు తదితరులున్నారు.

మృతుల కుటుంబాలకు టీడీపీ నేతల పరామర్శ


రేగిడిలో జల్లు కుటుంబాన్ని పరామర్శస్తున్న రేగిడి, వంగర టీడీపీ క్యాడర్

రేగిడి: మండలంలో ఆమదాలవలస, రేగిడి గ్రామాల్లో టీడీపీ కార్యకర్తల కుటుంబసభ్యులు మృతిచెందటంతో ఆదివారం రేగిడి, వంగర మండలాలకు చెందిన ముఖ్యనేతలు, వారి అనుచరులు పరామర్శించారు. ఆమదాలవలసలో మాజీ సర్పంచ్ వై హేమసుందరరావుకు మాతృవియోగం, రేగిడి మాజీ డీలర్ జల్లు సంగంనాయుడు మృతిచెందటంతో వీరి కుటుంబాలను రేగిడి, వంగర మాజీ ఎంపీపీలు కిమిడి రామకృష్ణంనాయుడు, పైల వెంకటరమణ, టీడీపీనేతలు ఉదయాన మురళీ, శాసపు కేశవనాయుడు, బెజ్జిపురపు త్రినాథ్‌రావు, దుప్పలపుడి నాగేశ్వరరావు, తెంటు కృష్ణమూర్తినాయుడు, ఎం గోవిందరావు, ఖగేంద్రనాయుడు, పల్లా వెంకట్రావు తదితర్లు పరామర్శించి తమ ప్రగాఢ సంతాపం వ్యక్తంచేశారు.

ప్రైవేటు పాఠశాలల సంఘం అధ్యక్షుడిగా 'గట్టి'


గట్టి పాపారావును సత్కరిస్తున్న దృశ్యం

రాజాం: జిల్లా ప్రైవేటు పాఠశాలల సంఘం అధ్యక్షుడిగా రాజాం విద్యానికేతన్ పాఠశాల డైరెక్టర్ గట్టి పాపారావు ఆదివారం నియమితులయ్యారు. ఆయనను ఈ సందర్భంగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఆదివారం సత్కరించాయి. సంఘం ప్రధాన కార్యదర్శిగా కె ఎల్లారావు, కోశాధికారిగా కాశయ్యనాయుడు, ఉపాధ్యక్షుడిగా బెవర ఈశ్వరరావు తదితరులు ఎన్నికయ్యారు.

పంట రుణాలు మాఫీ చేయాలి

● ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అప్పలనాయుడు



మాట్లాడుతున్న బుడితి అప్పలనాయుడు

పాలకొండ: కౌలు రైతుల పంటరుణాలు మాఫీ చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ఎల్ఎల్‌పురంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ కౌలురైతుల సమస్యలపై ఈనెల 8నజరిగే ధర్నాను విజయవం తం చేయాలని కోరారు. జంపరకోట ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని, రైతు,కౌలు రైతులకు రూ.2 లక్షల వరకు అన్ని రకాల పంట రుణాలు మాఫీ చేయాలని డిమాండ్‌చేశారు. కౌలు రైతులు సాగు చేస్తున్న ప్రతి ఎకరానికి రూ.15 వేలు సాగు సాయం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘంనాయకులు ద్వారపూడి అప్పలనాయుడు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రామ్మూర్తి, సిమ్మినాయుడు, మంజు దుర్గారావు పాల్గొన్నారు.

'పథకాలు రద్దుచేసి నిధుల మళ్లింపు'



మాట్లాడుతున్న రాయిపల్లి రత్నాకర్

వీరఘట్టం: ప్రభుత్వం 27 దళితులకు సంబంధించిన పథకాలను రద్దు చేసి కార్పొరేషన్‌గా విభజించి వాటికి నిధులు లేకుండా ఆ నిధులు ప్రభుత్వం వేరే పథకాలకు మళ్లిస్తోందని వీరఘట్టం పట్టణ టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాయిపల్లి రత్నాకర్ ఆరోపించారు. ఆదివారం వీరఘట్టంలో విలేకరులతో మాట్లాడుతూ గతప్రభుత్వాలు దళిత హక్కులకు భంగం లేకుండా చక్కగా పాలించాయన్నారు. తమ కుటుంబాలు బాగుపడాలంటే సీఎంగా మళ్లీ చంద్రబాబురావాలన్నారు.కార్యక్రమంలో దళితనాయకుడు మాణిక్యాలరావు, శశిభూషణరావు, నత్తల అరుణ్‌కుమార్, కల్యాణ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

'జగన్ గొప్పలు చెప్పుకోవడం విచారకరం'



మాట్లాడుతున్న హేమానాయక్

పార్వతీపురంటౌన్: రాష్ట్రంలో ఉన్న పేద, మధ్య తరగతి ప్రజలకు మోదీ ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలకు జగన్ ప్రభుత్వం తమ వంటు గొప్పలు చెప్పుకోవడం విచారకరమని బీజేపీ అరకు పార్లమెంట్ కేంద్రపథకాల పరి శీలకుడు హేమానాయక్ తెలిపారు. ఆదివారం పార్వతీపురంలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలతో రాష్ట్ర ప్రభుత్వం పబ్బంగడుపుతోందన్నారు.మోదీ ఇస్తున్న పథకాలకు కలరింగ్‌ఇచ్చి జగన్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందన్నారు.

డీఎస్సీలో పోస్టులు పెంచాలి

● మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు



మాట్లాడుతున్న శ్రీనివాసులనాయుడు

చీపురుపల్లి: డీఎస్సీలోని పోస్టుల సంఖ్యను పెంచాలని, అప్రెంటిస్‌షిప్ లేని డీఎస్సీని ప్రకటించాలని పీఆర్టీయూ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు కోరారు. ఆదివారం చీపురుపల్లిలో జరిగిన పీఆర్టీయూ జిల్లా కార్యవర్గసమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి రవీంద్రనాయుడు, రాష్ట్ర సంఘ నాయకులు బైరి అప్పారావు, జిల్లా నాయకులు రావాడ రాంబాబు, వాలేటి తవిటినాయుడు,కాగాన విజయ్, ము రళీకృష్ణ, కేశవరావు, శంకరాపు రమేష్ నాయుడు, గంగుపల్లి సత్యనారాయణ, బి.శివప్రసాద్, రౌతు రాము, పైడిరాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

విశాఖలో సాగర సంగ్రామ దీక్ష



సాగర సంగ్రామ దీక్షకు హాజరైన ఉద్యోగులు

నెల్లిమర్ల: నెల్లిమర్ల, గుర్ల మండలాల నుంచి ఉపాధ్యాయులు, ఉద్యోగులు భారీ స్థాయిలో విశాఖలో సాగర సంగ్రామ దీక్షకు తరలివెళ్లారని ఏపీపీటీఏ ప్రధాన కార్యదర్శి వి.రమణ తెలిపారు.ఆదివారం విశాఖలోజీవీఎంసీ ఎదురుగా గల గాంధీ విగ్రహం వద్ద ఆదివారం ఓట్ పర్ ఓపీఎస్ నినాదంతో సాగర సంగ్రామ దీక్ష మన కోసం మన కుటుంబం కోసం మన పిల్లల బంగారు భవిష్యత్తు కోసం సీపీఎస్, జీపీఎస్ రద్దు కోసం కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు.

బిల్లులు కాక.. పనులు సాగక

● పది మండలాల ప్రజల నరకయాతన
● ఇదీ రాజాం-డోలపేట విస్తరణ పనుల పరిస్థితి

రాజాం రూరల్

రాజాం-డోలపేట విస్తరణ పనులకు సంబంధించి కాంట్రాక్టర్‌కు బిల్లులు కాకపోవడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఎన్నికల సమయంలో ఈ రాష్ట్రం గురించి నాయకులు హామీలు ఇచ్చి తర్వాత విస్మరిస్తున్నారని వాహనచోదకులు ఆరోపిస్తున్నారు. ఈ రోడ్డు అధ్వానంగా ఉండడంతో పది మండలాల ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు.



రాళ్లు తేలిన రాజాం - డోలపేట రోడ్డు

పనుల్లో పురోగతి లేదు..

రాజాం పట్టణంలో విస్తరణ పనులకు గత ఏడాది జనవరి 18న మంత్రి బొత్స సత్యనారాయణ శంకుస్థాపన చేసినా పనుల్లో పురోగతిలేదు. చీపురుపల్లి రోడ్డులో బొబ్బిలి జంక్షన్ నుంచి గాయత్రీ కాలనీ వరకూ 1.34 కిలోమీటర్లు, పాలకొండ జంక్షన్ నుంచి జీఎంఆర్ఐటీ గేట్ వరకూ రెండు కిలోమీటర్లు 80 అడుగుల మేర విస్తరించాల్సిఉంది. ఇందులో భాగంగా రెండుమార్గాల్లో పనులు ప్రారంభించి కొంతమేర కాలువల పనులు జరిగినా సాంకేతిక సమస్యల వల్ల కొన్నిప్రాంతాల్లో భవనాల యజమానులు కొట్టివేతకు అంగీకరించలేదు. అంతేకాకుండా నిర్మాణాలు జరిపిన మేరకు కాంట్రాక్టరుకు చెల్లించాల్సిన రూ.4 కోట్ల బకాయిలను ప్రభుత్వం చెల్లించలేదు. దీంతో కాంట్రాక్టరు పనులు నిలిపివేశారు. ఫలితంగా రాజాం-డోలపేట మీదుగా నిత్యం రాకపోకలు సాగించే వందలాది మంది ఉద్యోగులు, విద్యార్థులు, రోగులతోపాటు వాహనచోదకులు నరకయాతన అనుభవిస్తున్నారు. తరచూ ఆటోలు బోల్తాపడుతుండడంతో పలువురు గాయపడుతున్నారు. కాగా నిధులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లించలేదని ఆర్‌అండ్‌బీ ఏఈ నాగభూషణం చెప్పారు. నిధులు మంజూరైతే పనులు తిరిగి ప్రారంభిస్తామని ఆంధ్రజ్యోతికి తెలిపారు.

అంధకారంలో మెయిన్‌రోడ్డు

చీకటిపడితే రాజాం మెయిన్‌రోడ్డులో అంధకారం నెలకుంటోంది. శ్రీకాకుళం రోడ్‌లోని సప్తగిరికాలనీ నుంచి బొబ్బిలిజంక్షన్ వరకూ సుమారు కిలోమీటరు మేర అవస్థలుతప్పడంలేదు. పట్టణంలో మొదటివిడత విస్తరణలో భాగంగా ఏర్పాటుచేసిన సెంటర్ లైటింగ్‌లో భాగంగా 55 స్తంభాలకు ఏర్పాటుచేసిన 110 లైట్లలో 65 లైట్లు వెలగడం లేదు. కాలిపోయిన బల్బుల స్థానంలో కొత్తవి బిగించలేదు. సప్తగిరికాలనీ నుంచి అంబేద్కర్‌జంక్షన్ వరకూ 32 స్తంభాలకు 64 లైట్లు వేయగా 40 లైట్లు పాడయ్యాయి. అంబేద్కర్ జంక్షన్ నుంచి బస్టాండ్ కూడలి వరకూ ఆరు స్తంభాలకు 12 లైట్లు ఉండగా తొమ్మిది లైట్లదీ ఇదే పరిస్థితి. బస్టాండ్ కూడలి నుంచి మాధవబజార్ జంక్షన్ వరకూ మూడు స్తంభాలకు ఆరు లైట్లకుగాను నాలుగు, మాధవబజార్ నుంచి బొబ్బిలి జంక్షన్ వరకూ 15 స్తంభాలకు 30 లైట్లు ఏర్పాటు చేయగా 12 లైట్లు కాలిపోయాయి. పట్టణంలో నెలకొన్న సమస్యను ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టానని, కొత్తలైట్లు ఏర్పాటు చేస్తామని రాజాం మునిసిపల్ కమిషనర్ ఆర్నెళ్లుగా చెబుతున్నా కార్యరూపం దాల్చడం లేదు.

ఆగని ఇసుక తరలింపు

● చంపావతి, ఏడోంపుల గెడ్డ నుంచి అక్రమరవాణా ● తాగునీటికి పొంచిఉన్న ముప్పు

గజపతినగరం: మండలంలోని చంపావతి, ఏడోంపుల గెడ్డ నుంచి ఇసుక తరలింపు ఆగడంలేదు. ప్రతిరోజూ అక్రమంగా తరలిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఇక్కడ ఇన్‌ఫిల్టర్ బావులకు నీరందడం లేదు. భూగర్భ జలాలు అడుగంటడంతో రానున్న రోజుల్లో తాగునీటి ముప్పుపొంచిఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. అక్రమ రవాణాపై గతంలో కూడా అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదని పలు గ్రామాల ప్రజలు చెబుతున్నారు. జగనన్న స్వగృహ నిర్మాణాలకు అవసరమైన ఇసుక లభించడంలేదని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు.

ఇదీ పరిస్థితి..

● లింగాలవలసలో ఏర్పాటుచేసిన ఇసుక రీచ్ నుంచి రాత్రి, పగలు తేడాలేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలించుకుపోతున్నారు. ● తుమ్మికాపల్లి గ్రామానికి ఆనుకుని ఉన్న ఏటిజోరు నుంచి ఇసుక యథేచ్ఛగా తరలిస్తున్నారు. సర్వేనెంబర్ 117లో ఏటిజోరులో సాగు చేసుకుంటున్న పొలాల నుంచి విజయనగరం, తగరపువలస, విశాఖ పట్టణాలకు ఇసుకను తరలించడంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ● ఎం. గుమడాంలోని ఏడోంపుల గెడ్డ నుంచి అక్రమంగా ఇసుకను తలిస్తుండడంతో బావులకు తీవ్ర నష్టం వాటిల్లడంతో సాగు, తాగునీటికి తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ● చంపావతి నది వంతెన నుంచి గంగచోళ్లపెంట, పురిటిపెంట, తుమ్మికాపల్లి, కెంగువ గ్రామాల నుంచి ఇసుకను నిత్యం అనుమతి లేకుండా తరలిస్తున్నారు.

ట్రాక్టర్లు సీజ్‌చేస్తాం..

అధికారుల అనుమతితో ఇసుక రవాణా చేయకపోతే చర్యలు తప్పవని గజపతినగరం ట్రైనీ డీఎస్పీ మహేంద్ర ఆంధ్రజ్యోతికి తెలిపారు. పట్టుబడిన ట్రాక్టర్లను సీజ్ చేస్తామని చెప్పారు. ఇప్పటికే నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేశామని తెలిపారు.



ఎం.గుమడాం వద్ద ఏడోంపులగెడ్డ నుంచి ట్రాక్టర్లపై ఇసుకను తరలిస్తున్న దృశ్యం

చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్

●బొబ్బిలి, పార్వతీపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిలు



మాట్లాడుతున్న విజయచంద్ర

సీతానగరం: రానున్న ఎన్నికల్లో చంద్రబాబును గెలిపిస్తే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని బొబ్బిలి, పార్వతీపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిలు బేబీనాయన, బోనెల విజయచంద్ర తెలిపారు. ఆదివారం మండలంలోని జానుమునివలసలో టీడీపీ మండలాధ్యక్షుడు కొల్లి తిరుపతినాయుడు, నాయకులు యాళ్ల రామినాయుడు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మేనిఫెస్టో, ఆరు గ్యారెంటీలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు గొట్టాపు అప్పారావు, రెడ్డి సింహాలు, సాల హరిబాబు పాల్గొన్నారు.

జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే ఏపీ కనుమరుగు

● టీడీపీ పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షుడు వేమలి చైతన్య



నా తొలి ఓటు చంద్రబాబుకే పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

గజపతినగరం: సీఎం జగన్ నాలుగేళ్ల పదినెలల పరిపాలనలో రాష్ట్రాన్ని దశాబ్దాల వెనక్కి నెట్టారని, మళ్లీ జగన్ అధికారంలోకి వస్తే దేశచరిత్రలో ఆంధ్రప్రదేశ్ కనుమరుగువుతుందని టీడీపీ పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షుడు వేమలి చైతన్య, క్లస్టర్ ఇన్‌చార్జి వి.ప్రదీప్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం గజపతినగరం పార్టీ కార్యాలయంలో నాతొలి ఓటు చంద్రబాబుకే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రం లో విద్యావ్యవస్థ భ్రష్టుపట్టించారని, ఉద్యోగాల భర్తీ చేయకపోవ డంతో యువత చెడువ్యసనాలకు బానిసలవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఎ.లక్ష్మునాయుడు, ప్రచారకమిటీ సభ్యుడు పెదిరెడ్ల సతీష్, ఉపాధ్యక్షులు సాలాపు లక్ష్మణ, తెలుగుయువత అధ్యక్షుడు పి.అప్పలస్వామి, టీఎన్ఎస్ ఎఫ్ నాయకులు గణపతిరావు పాల్గొన్నారు.

కిషోర్‌చంద్రదేవ్‌ను కలిసిన టీడీపీ నాయకులు



కిషోర్ చంద్రదేవ్‌తో మాట్లాడుతున్న నాయకులు

కురుపాం: టీడీపీ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిషోర్ చంద్రదేవ్‌ను కురుపాం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి, నాయకులు ఆదివారం తననివాసంలో కలిశారు.ఈసందర్భంగా పార్టీ కార్యక్రమాలు, నియోజకవర్గం పార్టీ పరిస్థితి, బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కేవీ కొండయ్య, నియోజకవర్గం తెలుగు మహిళ కార్యదర్శి వెంపటాపు భారతి, టీడీపీ నాయకులు సుకేష్ చంద్రపండా,బలగ రామకృష్ణ, పల్లి సురేష్,బాల, శ్రీను,ఆనంద్ పాల్గొన్నారు.

డీఎస్సీ పేరుతో జగన్‌రెడ్డి కొత్త డ్రామా

● సాలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సంధ్యారాణి



మాట్లాడుతున్న సంధ్యారాణి

మక్కువ: డీఎస్సీ పేరుతో జగన్‌రెడ్డి నిరుద్యోగులను మోసం చేసేందుకు కొత్త డ్రామాకు తెరతీశారని సాలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గుమ్మడి సంధ్యారాణి ఆరోపించారు. ఆదివారం మండలంలోని చెముడులో ఇంటింటికీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ముందు ఉద్యోగాల పేరిట యువతకు వల విసిరి వారి ఓట్లతో గెలిచి, చివరకు మొండి చేయి జగన్మోహన్‌రెడ్డి చూపించాడని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్, నాయకుడు మావుడి ప్రసాదరావు, గౌరీశంకర్, డాక్టర్ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

శాంతి ఆశ్రమంలో దివ్యజీవన సత్సంగం

వీరఘట్టం: పట్టణంలోని శాంతి ఆశ్రమంలో కర్రి గోపన్న ఆధ్వర్యంలో దివ్య జీవన సత్సంగం ఆదివారం నిర్వహించారు. పాలకొండ సత్యసాయి ప్రతినిధి ఎన్‌వీరమణ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు.

ఒడిశలమడకు రోడ్డు నిర్మించాలి



నిరసన తెలుపుతున్న గిరిజనులు

పాచిపెంట: మండలంలోని కుడుమూరు జంక్షన్ నుంచి ఒడిశలమడకు రోడ్డు నిర్మించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కోరాడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం గిరిజనులు ఆ గ్రామ మార్గమధ్యలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ రోడ్డు లేకపోవడంతో అనారోగ్య పరిస్థితులు ఎదురైనప్పుడు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఒడిశలమడ రోడ్డు నిర్మాణ విషయంపై పలుసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా ఫలితం లేకపోయిందని చెప్పారు. కార్యక్రమంలో సొయ్యారి సోమయ్య, కొర్రా శ్రీనివాసరావు, రాము, సింహాద్రి, పైడిరాజులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న అప్పారావు

గరివిడి: ఈపీఎస్ కనీస పెన్షన్ రూ.7500,ప్లస్ డీఏ ఇవ్వాలని, పెన్షన్ హోల్డర్‌కు ఉచిత వైద్యం అందించాలని ఈనెల 13న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఈపీఎస్ 95 యాజిటేషన్ కమిటీ విశాఖపట్నం కార్యదర్శి మంజుఅప్పారావు తెలిపారు.ఈ మేరకు గరివిడి ప్రాంతంలోని ఈపీఎస్ పెన్షనర్స్ పెద్ద ఎత్తున కదలిరావాలని పిలుపునిచ్చారు. ఆదివారం గరివిడిలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కోణిసి కృష్ణంనాయుడు, సీఐటీయూ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు జె.విశ్వనాథరాజు, అంబళ్ల గౌరునాయుడు, గరివిడి మండల ఈపీఎస్ సంఘం అధ్యక్షులు షేక్ సలీం, కార్యదర్శి ఓషన్ మూర్తి, ట్రెజరర్ బి.జగదీష్, గంటల అప్పలరాజు, ఫేకర్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కంది రామారావు, నాయకులు కర్ణం సన్యాసినాయుడు, వైగల సత్యం పాల్గొన్నారు.

'జనాభా దామాషా మేరకు సీట్లు కేటాయించాలి'

మెంటాడ: రానున్న లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో వెలమ సామాజిక వర్గానికి జనాభా దామాషా ప్రకారం ఐదు లోక్‌సభ, 25 అసెంబ్లీ సీట్లు అన్ని రాజకీయ పార్టీలు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు కోరారు. ఈ మేరకు ఆదివారం మెంటాడలో విలేకరులతో మాట్లాడుతూ వెలమ సంక్షేమ సంఘానికి విశాఖలో రెండెకరాల స్థలం కేటాయించాలని, సామాజిక వర్గాన్ని బీసీఏ జాబితాలోకి మార్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘ కార్యదర్శి పెదిరెడ్డి సత్యం, నాయకులు బర్ల పైడం నాయుడు, పెదిరెడ్ల శ్రీనివాస్, లగుడు శ్రీనివాస్, పి.మల్లయ్య దొర, బొదంకి రమణ పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థిని మృతి

సాలూరు రూరల్: అనారోగ్యంలో చికిత్స పొందుతూ ఎనిమిదో తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థిని ఆదివారం మృతి చెందింది. గ్రామస్థుల కథనం మేరకు.. సాలూరు మండలంలోని తుండకు చెందిన ఎస్.శ్వేత (12) పాచిపెంట గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. దసరా సెలవులు సమయంలో ఇంటికొచ్చిన శ్వేత అస్వస్థతకు గురవడంతో తల్లిదండ్రులు రామారావు, సామాలమ్మలు సాలూరు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. అలాగే డిసెంబరులో సాలూరు ఏరియా ఆసు పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. గత నెలలో శ్వేత ఆరోగ్యం క్షీణించడంతో సాలూరులో ఆసుపత్రికి మళ్లీ తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో వైద్యుల సలహా మేరకు విశాఖ కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతు మృతి చెందింది.

జీడి రైతుల్లో పొగ మంచు గుబులు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఏజెన్సీ ప్రాంతంలో జీడి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ సుమారుగా 15 వేల ఎకరాల్లో తోటలు సాగులో ఉన్నాయి. ఈనేపథ్యంలో ఇక్కడ జీడిపూతకు పొగమంచు వల్ల జీడి పువ్వుకు పురుగుఆశిస్తోంది. దీంతో జీడి పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని గిరిజనులు గుబులు చెందుతున్నారు. జీడి పూతపై క్రిమిసంహారక మందు పిచికారీచేయడానికి ఐటీడీఏలేదా వ్యవసాయశాఖ ద్వారా క్రిమిసంహారక మందులు పంపిణీ చేయాలని గిరిజన రైతులు కోరుతున్నారు.కాగా ప్రస్తుతం మామిడితోపాటు జీడి పైత ఆశా జనకంగా ఉంది. ఏజెన్సీ ప్రాంతంలో సుమారు వెయ్యి ఎకరాల్లో మామిడితోటలతోపాటు కొండ ప్రాంతాల్లో కొండ మామిడి చెట్లు కూడా పెద్దఎత్తున ఉన్నాయి. కొండమామిడి తాండ్రకు ఒడిశాలోని పలు ప్రాంతాలు, కోల్‌కత్తా తదితర ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉంది. దీంతో చెట్టు నుంచి సేకరించిన మామిడిగుజ్జును తాండ్రగా తయా రుచేస్తారు. ఈనేపథ్యంలో ఇక్కడ గత ఏడాది మామిడి దిగుబడి ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ఈ ఏడాది దిగుబడిపై ఆశపెట్టుకున్నారు. కొందరు రైతులు మామిడిపూతపై పురుగు పట్టకుండా క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తున్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

గంట్యాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఎంపీపీ వీరుబండి హైమావతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఈ సందర్భంగా వివిధ శాఖ అధికారులు ప్రగతిని చదివి వినిపించారు. కార్యక్రమంలోని ఎంపీడీవో భవానీ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి

గజపతినగరం: క్యాన్సర్‌వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్యాధికారి అరుణకుమారి తెలిపారు.ఆదివారం గజపతినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం పురస్కరించుకుని క్యాన్సర్‌వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రావాడ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ పద్మలత పాల్గొన్నారు.

మహిళలకు ఆర్థిక భరోసాయే ధ్యేయం

బొండపల్లి: బొండపల్లి సమీపంలో నాలుగో విడత ఆసరా సంబరాలు ఆదివారం ఎంపీపీ చల్లా చలంనాయుడు అధ్యక్షతన నిర్వహించారు.ఈసందర్భంగా మండలంలో 1,138సంఘాల్లో గల 11, 942 మంది సభ్యులకు రూ.7కోట్ల, 71 లక్షల, 382లు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అప్పలనర్సయ్య మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడమే ధ్యేయమన్నారు. ఎమ్మెల్సీ పెను మత్స సురేష్‌బాబు, ఏపీడీ సావిత్రి, ఎంపీడీవో హరిహరరావు, సులోచనాదేవి పాల్గొన్నారు.

'లక్ష్యాలను నిర్దేశించుకోవాలి'

చీపురుపల్లి: విద్యార్థిదశలోనే లక్ష్యాలను నిర్దేశించుకోవాలని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు.చీపురుపల్లిలో నిర్మించిన గద్దే బాబూరావు ప్రభుత్వపాలిటెక్నిక్‌కళాశాల భవనాలను ఆదివారం ప్రారంభించారు ఈసందర్భంగా సాంకేతిక విద్య ప్రిన్సిపల్ కార్యదర్శి సురేష్ కుమార్ మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధిలో శిక్షణతీసుకున్న వారికి చక్కటి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశఖర్, మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు, ఆర్డీవో బి.శాంతి, కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.విజయలక్ష్మి, జేసీ కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, ఆర్జేడీ సత్యనారాయణమూర్తి, ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, తహశీల్దారు ఎస్.ప్రసాద్‌రావు, ఎంపీడీఓ డి.శ్వేత, పాల్గొన్నారు. తొలుత పేరిపిలో వెల్‌నెస్‌సెంటరు, సచివాలయం, ఆర్బీకే భవనాలను ప్రారంభించారు.

ఇళ్ల స్థలాలు మంజూరుచేయాలి

గంట్యాడ: గంట్యాడలో అర్హులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని రేవళ్ల సతీష్ తదితరులు కోరారు.ఈ మేరకుతహసీల్దార్‌కు గ్రామంలో పది మంది అర్హులకు స్థలాలు మంజూరుచేయాలని గతఏడాది జనవరిలో దరఖాస్తుచేసుకున్నా, ఇప్పటివరకూ మంజూరు చేయలేదని పేర్కొన్నారు.ఈవిషయంపై కలెక్టరేట్ స్పందనలో కూడా ఫిర్యాదుచేసినట్లు తెలిపారు.ఇళ్లస్థలాలు మంజూరుచేయకపోతే నిరసనకార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. కాగా ఈసమస్యను పరిశీలించి, పరిష్కరిస్తామని తహసీల్దార్ నీలకంఠరేశ్వరెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గంట్యాడ: మండలంలోని నరవ ఏఎంజీ కాలనీ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు... గంట్యాడ నుంచి విజయనగరం ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని ఎదురుగా వస్తున్న కారుఢీకొంది.దీంతో గాయపడిన వ్యక్తిని స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో వాహన సిబ్బంది జిల్లాకేంద్రాసుపత్రికి తరలించారు. క్షతగ్రాతుడికి కాళ్లు విరిగిపోవడంతోపాటు బలమైన గాయాలయ్యాయి.

రూ.55,200 స్వాధీనం

పూసపాటిరేగ: వెంపడాం శివారులో పేకాట ఆడుతున్న వారిని శనివారంరాత్రి ఎస్ఐ సన్యాసినాయుడు దాడులు నిర్వహించి అదుపులోకి తీసుకున్నారు. సమాచారంతో మాటువేసి పోలీసులు ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుంచి రూ. 55,200లు స్వాధీనం చేసుకున్నారు. ఇటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోక తప్పదని ఎస్ఐ తెలిపారు.